క్లుప్తంగా

దత్తసాయి మందిరంలో అన్నప్రసాద వితరణ



మధురానగర్(విజయవాడసెంట్రల్): పసుపుతోట శ్రీదత్తసాయి మందిరంలో గురువారం సాయినాథుడికి ఆలయ వ్యవస్థాపకుడు తంగెళ్లమూడి వీరమోహనరావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని బాబాను దర్శించుకుని పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. భక్తులు, విద్యార్థులు బాబాను దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు. శ్రీసాయి నక్షత్ర మాలిక మండలి ఆధ్వర్యాన బాబా పారాయణం జరిగింది. మధ్యాహ్నం 500 మంది భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

సంస్థ అభివృద్ధికి కృషి చేయాలి



ఇబ్రహీంపట్నం: ఎన్టీటీపీఎస్ చీఫ్ ఇంజినీర్‌గా ఇటీవల కాలంలో బాధ్యతలు స్వీకరించిన పి.నవీన్‌గౌతమ్‌ను వైఎస్సార్ సీపీ బూత్ కన్వీనర్ల కోఆర్డినేటర్ లంకే అంకమోహనరావు, నాయకులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువా కప్పి పుష్పగుచ్ఛాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. సంస్థ అభివృద్ధికి అంకుతిత దీక్షతో కృషి చేయాలని కోరారు. స్థానికులుగా పార్టీ పరంగా తమ వంతు సహకారం అందిస్తామన్నారు. నాయకులు నల్లమోతు చిన్నయ్య, ప్రకాష్, దయాకర్ పాల్గొన్నారు.

క్రీస్తు బోధనలు అనుసరణీయం



నందిగామ టౌన్: ఏసుక్రీస్తు బోధనలు అనుసరణీయమని నందిగామ ఎమ్మెల్యే మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. మండలంలోని తక్కెళ్లపాడులో గురువారం ఏసుక్రీస్తు నూతన విగ్రహ ప్రతిష్టా మహోత్సవాలను ఘనంగా నిర్వహించారు. తొలుత ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏసు మార్గంలో నడుచుకుంటూ తోటి వారిపై ప్రేమ, దయ, జాలితో నడుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు పాల్గొన్నారు.

వైభవంగా సుబ్రహ్మణ్యస్వామి కల్యాణోత్సవం



భవానీపురం(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువైన శ్రీదుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి కల్యాణోత్సవం గురువారం వైభవంగా నిర్వహించారు. ప్రతి నెలా షష్ఠి రోజున ఆలయ అర్చకులతో నిర్వహించే కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. కార్యక్రమంలో దుర్గ గుడి ట్రస్ట్ బోర్డు చైర్మన్ కర్నాటి రాంబాబు, ఆలయ కార్యనిర్వహణాధికారి భ్రమరాంబ, ట్రస్ట్ సభ్యులు కట్టా సత్తెయ్య పాల్గొన్నారు. షష్ఠి సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేసి సుబ్రహ్మణ్య స్వామి కల్యాణోత్సవాన్ని తిలకించారు.

వాటర్‌ట్యాంకర్ ప్రారంభం

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): మల్లాది వెంకట సుబ్బారావు, సుందరమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత మంచినీటి ట్యాంకర్‌ను సింగ్‌నగర్ ఆంధ్రప్రభకాలనీలోని తన కార్యాలయం వద్ద రాష్ట్ర ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు గురువారం ప్రారంభించారు. 20 వేల లీటర్ల సామర్థ్యం కలిగిన మంచినీటి ట్యాంకర్ ద్వారా శివారు ప్రాంతాల్లో, తాగునీరు లేని ప్రాంతాల్లో ప్రజలకు ఉచితంగా మంచినీరు అందించడానికి ట్యాంకర్‌ను అందుబాటులో ఉంచినట్లు ఆయన తెలిపారు. ఈ వేసవి సమయంలో మంచినీళ్ల కోసం ఇబ్బందులు పడుతున్న ప్రజలకు ఇవి ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని, తాగునీరు కావాల్సిన వారు 99497-78499 మొబైల్ నంబర్‌లో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కొండాయిగుంట మల్లీశ్వరి, నాయకులు పిల్లి కృష్ణవేణి, కగ్గా పాండురంగారావు, మానం వెంకటేశ్వరరావు, యర్రంశెట్టి శ్రీను పాల్గొన్నారు.

పదింతల శ్రద్ధ

- సప్లిమెంటరీ.. డోంట్ వర్రీ..
- విద్యా సంవత్సరం నష్టపోకుండా ప్రభుత్వం చర్యలు
- పదో తరగతి తప్పిన విద్యార్థులకు పాఠశాలల్లో ప్రత్యేక తరగతులు
- నియోజకవర్గంలో 490 మంది విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ



పెనుగంచిప్రోలు కేవీఆర్ జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

పెనుగంచిప్రోలు: పదో తరగతి తప్పిన విద్యార్థులు విద్యా సంవత్సరం నష్టపోకుండా ప్రభుత్వం శ్రద్ధ చూపి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తోంది. పది సప్లిమెంటరీ పరీక్షల్లో విద్యార్థులు ఉత్తీర్ణులు కావడానికి రాష్ట్ర ప్రభుత్వం తగిన శ్రద్ధ చూపుతోంది. కెరీర్ నష్టపోకుండా విద్యార్థుల్లో స్థైర్యం నింపుతోంది. ఒకప్పుడు పది తప్పిన విద్యార్థులు విద్యా సంవత్సరం కోల్పోయే ప్రమాదం ఉండేది. అయితే అలాంటి వారి కోసం రాష్ట్ర ప్రభుత్వం సెలవు దినాల్లో కూడా ప్రత్యేక తరగతులు ఏర్పాటు చేసి శిక్షణ ఇస్తుండటంతో విద్యార్థుల తల్లిదండ్రుల్లో హర్షం వ్యక్తమవుతోంది.

జగ్గయ్యపేటలో..

జగ్గయ్యపేట నియోజకవర్గంలో ఈ ఏడాది పదో తరగతి పరీక్షలకు మండలంలో 772 మంది విద్యార్థులు హాజరవ్వగా 451 మంది, పెనుగంచిప్రోలు మండలంలో 337 మందికి 247 మంది, వత్సవాయి మండలంలో 533 మందికి 454 మంది ఉత్తీర్ణత సాధించారు. మొత్తం 1642 మంది విద్యార్థులకు 1152 మంది ఉత్తీర్ణత సాధించగా 490 మంది ఫెయిల్ అయ్యారు. వారి కోసం జూన్ 2 నుంచి సప్లిమెంటరీ పరీక్షలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు విద్యాశాఖ ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ సప్లిమెంటరీ పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేస్తోంది. గతంలో కేవలం విద్యార్థుల ఉత్తీర్ణత శాతంపైనే దృష్టి పెట్టేవారు. అయితే పరీక్ష తప్పిన విద్యార్థులకు పాఠశాలల్లో ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు రోజూ ఆయా సబ్జెక్టులు బోధించే ఉపాధ్యాయులతో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు.

విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ



పరీక్షల్లో తప్పిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి శిక్షణ ఇస్తున్నాం. ఏ సబ్జెక్ట్‌లో ఫెయిల్ అయితే ఆ సబ్జెక్ట్ ఉపాధ్యాయులతో పాఠాలు చెప్పించడం, ప్రత్యేక టెస్ట్ పెడుతున్నాం. దీంతో విద్యార్థులు సంవత్సరం నష్టపోకుండా ఉంటారు. విద్యార్థుల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపడం సంతోషం.

–ఎం.సూరిబాబు, హెచ్‌ఎం, ముండ్లపాడు

విద్యార్థులకు సదవకాశం



గతంలో ఎన్నడూ లేనివిధంగా పరీక్ష తప్పిన విద్యార్థులకు పాఠశాలలోనే ప్రత్యేక తరగతులు నిర్వహించడం మంచి అవకాశం. ప్రతి విద్యార్థిపై ప్రత్యేక దృష్టి పెట్టి బోధన చేస్తున్నాం. దీన్ని వినియోగించుకోవాలి. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషికి విద్యార్థుల తల్లిదండ్రులు ఆనందిస్తున్నారు.

–ముక్కా సత్యనారాయణ, ఉపాధ్యాయుడు

మానవ రవాణాపై అవగాహన ఉండాలి

నందిగామ(చందర్లపాడు): మానవ అక్రమ రవాణాపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి చంద్రయ్య చెప్పారు. హైదరాబాద్‌కు చెందిన ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ, డీఆర్‌డీఏల సంయుక్త ఆధ్వర్యాన మండల కేంద్రం చందర్లపాడులో గురువారం అవగాహన ర్యాలీ చేసి స్థానికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ మానవ అక్రమ రవాణా, లైంగిక వ్యాపారానికి వ్యతిరేకంగా తమ సంస్థ ఆధ్వర్యంలో 26 ఏళ్లుగా వేలాది మంది మహిళలను కాపాడగలిగామన్నారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు శ్రావ్య, డీఆర్‌డీఏ సిబ్బంది మునిరత్నం, సుధారాణి తదితరులు పాల్గొన్నారు.



చందర్లపాడులో స్వచ్ఛంద సంస్థల ప్రతినిధుల ఆధ్వర్యాన అవగాహన ర్యాలీ

డస్ట్‌బిన్ల పంపిణీ



పటమట(విజయవాడతూర్పు): మేరీ లైఫ్ మేరా స్వచ్ఛ షహర్ కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛత పక్వాడ – శుభ్రత కార్యక్రమంలో భాగంగా విజయవాడ రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పొరేషన్ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ(సీఎస్‌ఆర్)లో భాగంగా 315 డస్ట్‌బిన్లను, కౌమారదశ ఆడపిల్లల పర్సనల్ హైజీన్‌కు సంబంధించి 500 ఐఈసీ మెటీరియల్‌ను వీఎంసీ అడిషనల్ కమిషనర్(ప్రాజెక్ట్స్) కె.వి.సత్యవతికి అందించారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని ఏసీ చాంబర్‌లో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పొరేషన్ తరఫున డస్ట్‌బిన్లను అందించటం అభినందనీయమన్నారు. భవిష్యత్తులో సోలార్ ఎనర్జీకి సంబంధించిన వ్యవహారంలో తమ సహకారం ఉంటుందని ఆ సంస్థ పేర్కొనటం హర్షణీయమని చెప్పారు. భవిష్యత్తులో కూడా వివిధ కార్యక్రమాల ద్వారా విజయవాడ నగర అభివృద్ధికి సంస్థ తోడ్పడాలని కోరారు. కార్యక్రమంలో రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పొరేషన్ చీఫ్ ప్రోగ్రామ్ మేనేజర్ ఎస్.జయంతి, డెప్యూటీ మేనేజర్ కృష్ణ చైతన్య, ప్రాజెక్ట్ ఇంజినీర్ ముత్తు రామకృష్ణ, సోనీ గోపిక ప్రసాద్ పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి

వీరులపాడు: ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేసి గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని ఎంపీపీ కోటేరు లక్ష్మి అన్నారు. స్థానిక జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన గురువారం మండల పరిషత్ సాధారణ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. ముఖ్యంగా వేసవిలో తాగు, వాడుక నీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. తాగునీరు సక్రమంగా సరఫరా జరగని గ్రామాలపై దృష్టి సారించాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు సూచించారు. గ్రామాల్లో ప్రతి ఒక్క సమస్యను గుర్తించి పరిష్కారానికి కృషి చేస్తున్నామని అధికారులు అందుకనుగుణంగా పని చేయాలని కోరారు. అనంతరం గతంలో విజయవాడ నుంచి గ్రామానికి ఆర్టీసీ సర్వీస్ ఉండేదని కొంత కాలంగా అది నడవకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని దొడ్డదేవరపాడు గ్రామ ఎంపీటీసీ సభ్యుడు తోట నారాయణరావు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన ఎంపీపీ మాట్లాడుతూ ఆర్టీసీ ఉన్నతాధికారులతో మాట్లాడి బస్సు సర్వీస్ నడవడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యురాలు అమర్లపూడి కీర్తి సౌజన్య, వైస్ ఎంపీపీలు షేక్ నాగుల్‌మీరా, వేమూరి ఆదాం, ఎంపీటీసీ సభ్యులు ఇప్పల సత్యనారాయణ రెడ్డి, వేమిరెడ్డి కోటేశ్వరి, యాదాల సుజాత, పల్లెపోగు మార్తమ్మ, మోంద్రు బాయమ్మ, ఐలూరి వెంకట్రావమ్మ, బండి సీతామహాలక్ష్మీ, ప్రకాశరావు, సర్పంచ్‌లు,ఎంపీడీవో అరుంధతీ దేవి, తహసీల్దార్ ఆశయ్య నాయక్ పాల్గొన్నారు.



మండల పరిషత్ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ కోటేరు లక్ష్మి

వైభవంగా అమ్మవార్ల విగ్రహాలు పునఃప్రతిష్ట

పొందుగల(మైలవరం): గ్రామంలో వేంచేసి యున్న ముత్యాలమ్మ తల్లి, నిలువులమ్మ, సత్తెమ్మ తల్లి అమ్మవార్ల విగ్రహాల పునఃప్రతిష్ఠ మహోత్సవం గురువారం వైభవంగా నిర్వహించారు. మహోత్సవానికి మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్, ఆయన తనయుడు ధీమంత్ సాయి అమ్మవార్లను దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ మాట్లాడుతూ సమస్త ప్రాణ కోటి సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించామన్నారు. భక్త కమిటీ సభ్యులు ఎమ్మెల్యే వసంతకు ఘన స్వాగతం పలికారు. అనంతరం జరిగిన అన్నదాన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆడిటర్ సుంకర అక్కయ్యనాయుడు, ఏఎంసీ చైర్మన్ అప్పిడి సత్యనారాయణరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు ఎస్. తిరుపతిరావు, ఎంపీపీ ఇస్లావత్ ప్రసన్నరాణి స్వామి, డి. చలపతిరావు గ్రామస్తులు పాల్గొన్నారు.

విజ్ఞాన శిబిరాలను వినియోగించుకోండి



కంచికచర్ల గ్రంథాలయంలో విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు



పెనుగంచిప్రోలు శిక్షణ శిబిరంలో విద్యార్థులు



విద్యార్థులకు స్నాక్స్ పంపిణీ చేస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ ప్రభాకర్ తదితరులు

కంచికచర్ల: వేసవిలో విద్యార్థుల కోసం నిర్వహిస్తున్న విజ్ఞాన శిబిరాలను వినియోగించుకోవాలని ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని శాఖా గ్రంథాలయ గ్రంథపాలకుడు అల్లూరు రామచంద్రుడు అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో రాష్ట్ర పౌర గ్రంథాలయశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో గురువారం విద్యార్థులకు చిత్రలేఖనం పలు విభాగాల్లో ఆటలు నిర్వహించారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు షేక్ ఇస్మాయిల్ మాట్లాడుతూ, అంతర్జాతీయ తప్పిపోయిన పిల్లల దినోత్సవం సందర్భంగా తప్పిపోయిన పిల్లలను సోషల్ మీడియా ద్వారా వారి తల్లిదండ్రుల చెంతకు చేర్చి మానవత్వం చాటుకోవాలన్నారు. అనంతరం తెలుగు భాషపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం కథలు, చదవటం, పొడుపు కథలు, డ్రాయింగ్ నేర్పించారు. యోగా గురువు నారాయణ విద్యార్థులకు యోగా నేర్పించారు. కార్యక్రమంలో విశ్రాంత గ్రంథపాలకుడు వెంకటేశ్వరరావు, రచయిత నీలం సర్వేశ్వరరావు, భవిత సెంటర్ ఐఈఆర్టీ ఉపాధ్యాయుడు కనకారావు తదితరులు పాల్గొన్నారు.

పెనుగంచిప్రోలు: గ్రంథాలయాల్లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన వేసవి శిక్షణ శిబిరాలను ఉపయోగించుకోవాలని గ్రంథాలయాధికారులు ఇంజం మధు, మధుబాబు అన్నారు. వేసవి శిబిరంలో భాగంగా గురువారం పెనుగంచిప్రోలు, అనిగండ్లపాడు శాఖాగ్రంథాలయాల్లో విద్యార్థులకు కథలు చెప్పించడం, పుస్తకాలు చదివించడంతో పాటు కార్టూన్లు గీయించడం చేశారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, విద్యార్థులు పాల్గొన్నారు.

జగ్గయ్యపేట అర్బన్: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని మునిసిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్ అన్నారు. స్థానిక గ్రేడ్–1 శాఖ గ్రంథాలయాన్ని గురువారం సందర్శించారు. ఆయన మాట్లాడుతూ వేసవి సెలవుల్లో విలువైన సమయాన్ని వృథా చేసుకోకుండా విజ్ఞాన శిబిరానికి వచ్చి అనేక కొత్త విషయాలు తెలుసుకుని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం తుమ్మల ప్రభాకర్ ఆధ్వర్యంలో పిల్లలకు స్నాక్స్ పంపిణీ చేశారు. పెనుగంచిప్రోలు మండల సచివాలయాల కన్వీనర్ కన్నమాల శామ్యూల్, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు ఖాదర్‌బాబు, మున్సిపల్ కాంట్రాక్టర్లు శ్రీను, చిరంజీవి, గ్రంథాలయాధికారి ఎ.ప్రభ తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లు.. స్వచ్ఛంద సేవకులు



పరిటాలలో వలంటీర్లకు నియామక పత్రాలు అందజేస్తున్న ఆనందజోత్స్న, రవీంద్రనాథ్

పరిటాల(కంచికచర్ల): వలంటీర్లు.. స్వచ్ఛంద సేవకులని, కులం, మతం, రాజకీయాలతో సంబంధం లేకుండా అర్హులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేస్తారని సర్పంచి యద్దనపూడి ఆనందజోత్స్న అన్నారు. మండలంలోని పరిటాల సచివాలయంలో ఖాళీగా ఉన్న మూడు వలంటీర్ల పోస్టుల్లో ముగ్గురిని నియమించి గురువారం నియామక పత్రాలు అందజేశారు. సర్పంచి మాట్లాడుతూ వలంటీర్లు తమ పరిధిలో ఉండే కుటుంబాల వినతులు, వారి సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి పని చేస్తారన్నారు. లబ్ధిదారుల ఎంపిక, సమస్యల పరిష్కారంలో వీరు కీలకపాత్ర పోషిస్తారన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను లబ్ధిదారుల ఇంటికే వెళ్లి అందజేస్తుంటారన్నారు. విద్య, ఆరోగ్యపరంగా తమ పరిధిలోకి కుటుంబాలకు అవగాహన కల్పిస్తుంటారని తెలిపారు. ఖాళీగా ఉన్న మూడు పోస్టుల్లో మందా రమేష్, షేక్ ఖాసిం, పోతుల తిరుమలరాణికి నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ సచివాలయ మండల కన్వీనర్ చింతా రవీంద్రనాథ్, నాయకులు యద్దనపూడి విజయారావు, మార్త శ్రీనివాసరావు, వేముల నాగరాజు, పంచాయతీ కార్యదర్శి షేక్ మీర్జావలి, పంచాయతీ సీనియర్ అసిస్టెంట్ వెల్లంకి రామారావు, తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛమైన తాగునీరు అందించడమే లక్ష్యం

మునిసిపల్ కమిషనర్ జయరాం



వార్డు పరిధిలో అందుతున్న తాగునీటిని పరిశీలిస్తున్న కమిషనర్

నందిగామ: ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించడమే లక్ష్యమని మునిసిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం పేర్కొన్నారు. పట్టణ పరిధిలోని 13వ వార్డులో గురువారం ఆయన పర్యటించారు. స్థానికులకు సరఫరా అవుతున్న తాగునీటిని పరిశీలించి ఆ ప్రాంతంలో జరుగుతున్న ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛమైన తాగునీటి సరఫరాకు ఎప్పటికప్పుడు నీటికి క్లోరినేషన్ టెస్టులు చేస్తున్నట్లు తెలిపారు. పారిశుద్ధ్యం మెరుగునకు ప్రజలు సహకరించాలన్నారు. ప్రజలు తడి, పొడి, హానికరమైన చెత్తను వేర్వేరుగా భద్రపరచి పారిశుద్ధ్య కార్మికులకు అందించాలని కోరారు. కార్యక్రమంలో ఆయన వెంట పలువురు సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి కోటి శ్రీకృష్ణనామ జప యజ్ఞం



ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కొవ్వూరు శ్రీరామానంద గౌడీయ మఠం ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి వారం రోజుల పాటు పాతబస్తీలోని మద్ది సుబ్బారావు ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ ప్రాంగణంలో కోటి శ్రీకృష్ణనామ జప యజ్ఞం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆ మఠం పీఠాధిపతి త్రిదండి స్వామి శ్రీ భక్తి విబుధ వామన మహారాజ్ చెప్పారు. ఈ సందర్భంగా హైస్కూల్ ప్రాంగణంలో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. విశ్వశాంతి కోసం, లోకకల్యాణార్థం కోటి శ్రీకృష్ణ నామ యజ్ఞం, నామ జప యజ్ఞపూజ, సంకీర్తనోత్సవం తదితర కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. సమాజంలో ఆధ్యాత్మిక చింతనను పెంపొందించటం ద్వారా శాంతిని వర్ధిల్లింపజేయడానికి తద్వారా మానవుల జీవితాలకు సార్థకత చేకూర్చడానికి యజ్ఞం చేపడుతున్నట్లు తెలిపారు. ఈ నెల 26 నుంచి 31వ తేదీ వరకూ ప్రతి రోజూ తెల్లవారుజాము నుంచి రాత్రి వరకూ పూజలు, భజనలు, ఉపన్యాసాలు జరుగుతాయన్నారు. ప్రధానంగా దేశం నలుమూలల నుంచి హరేరామ మార్గంలో పయనిస్తున్న పలువురు ప్రముఖులు కార్యక్రమాల్లో పాల్గొని ప్రసంగాలు చేస్తారని చెప్పారు. జూన్ ఒకటో తేదీన పూర్ణాహుతితో యజ్ఞం ముగిస్తుందన్నారు. శుక్రవారం సాయంత్రం జరిగే ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి తదితర ప్రముఖులు హాజరవుతారని తెలిపారు. సమావేశంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన గోవింద మహారాజ్, నిష్కంచన మహారాజ్, వివేక బోధయన మహారాజ్, విష్ణు మహారాజ్, సుధిర దామోదర మహారాజ్, జనార్ధన మహారాజ్, కృష్ణ బ్రహ్మచారి, కొలిపర మల్లి పాల్గొన్నారు.

సినీరంగ ప్రముఖుల మృతికి సంతాపం



నివాళులర్పిస్తున్న నిర్వాహకులు చిట్టిబాబు, డేవిడ్‌రాజు తదితరులు

విజయవాడకల్చరల్: తెలుగు కళావాహిని, కళా సంస్థల ఐక్యవేదిక ఆధ్వర్యంలో గాంధీనగర్ కౌతా పూర్ణానందం కళావేదికపై గురువారం సినీ నటుడు శరత్‌బాబు, సంగీత దర్శకుడు రాజ్ మృతికి సంతాపం వ్యక్తం చేశాయి. తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు మాట్లాడుతూ.. శరత్‌బాబు స్వయంకృషితో ఉన్నత శిఖరాలకు చేరుకున్న నటుడని ఆయన మృతి సినీ రంగానికి తీరని లోటని చెప్పారు. కళావేదిక కన్వీనర్ డేవిడ్‌రాజు మాట్లాడుతూ సంగీత దర్శకుడు రాజ్ ఎన్నో విజయవంతమైన చిత్రాలకు సంగీత దర్శకత్వం వహించారన్నారు. సంతాప సభలో బీవీ వీరభద్రరావు, దండు చంద్రశేఖర్, బీవీ రామ్మోహన్, ఆర్.చలపతిరావు, గంగాధర్ షబానా, పాల్గొన్నారు. శరత్‌బాబు, రాజ్ చిత్రపటాలకు నివాళులర్పించారు.

ఏపీ జెన్‌కో నూతన కార్యవర్గం ఎన్నిక



ఇబ్రహీంపట్నంలో జరిగిన సమావేశంలో ఎన్నికైన కొత్త కార్యవర్గం

ఇబ్రహీంపట్నం:వీటీపీఎస్ ప్రాంతీయశాఖ, ఏపీజెన్‌కో సర్వసభ్య సమావేశం ఏపీ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్–1104 కార్యాలయంలో నిర్వహించారు. కొన్నేళ్లుగా పోరాడి సాధించుకున్న అంశాలను యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు చంద్రశేఖరరావు వివరించారు. పెండింగ్‌లో ఉన్న పే రివిజన్ సాధనకు సంస్థ యాజమాన్యంతో చర్చలు సఫలం అవుతాయనే ఆశాభావం వ్యక్తం చేశారు. కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు ప్రస్తావించారు. నూతన కార్యవర్గం ఎన్నికలో జెన్‌కో అధ్యక్షుడిగా పీవీ కృష్ణయ్య, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా ఆర్.సతీష్‌కుమార్, కార్యదర్శిగా ఆర్. శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడిగా ఎ.కోటేశ్వరరావు, కోశాధికారిగా అయూబ్‌ఖాన్ ఎన్నికయ్యారు. ఎన్టీటీపీఎస్ ప్రాంతీయ ఎన్నికల్లో డి.వెంకటరమణ అధ్యక్షుడు, కార్యనిర్వాహక అధ్యక్షుడు సత్యనారాయణ, ఆర్.శ్రీనివాసరావు కార్యదర్శి, రామ్మోహనరావును కోశాధికారిగా ఎన్నుకున్నారు. నాయకులు జగదీశ్వర్, గణపతి పాల్గొన్నారు.

ఉద్యోగుల బదిలీల ఆమోదం హర్షణీయం

ఇబ్రహీంపట్నం: గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల బదిలీలకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆమోదం తెలపడంపై సచివాలయ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ జానీపాషా గురువారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్ణయంతో మూడున్నరేళ్లుగా ఎదురుచూస్తున్న సచివాలయ ఉద్యోగుల కల ఫలించిందన్నారు. అంతర్ జిల్లాల రిక్వెస్ట్ ట్రాన్స్‌ఫర్‌కు అవకాశం కల్పించిన సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి, సచివాలయ ఉద్యోగులకు కృతజ్ఞతలు ఆయన తెలిపారు.

ద్విచక్రవాహనం అదుపుతప్పి వ్యక్తికి గాయాలు

ఇబ్రహీంపట్నం: స్థానిక సెవెంత్‌డే స్కూల్ సమీపంలో 65వ నెంబర్ జాతీయ రహదారిపై గురువారం ద్విచక్రవాహనం అదుపుతప్పి పల్టీ కొట్టిన ప్రమాదంలో ఓవ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. గుంటూరుకు చెందిన నారాయణ అనే వ్యక్తి తన వాహనంపై జగ్గయ్యపేటకు వ్యక్తిగత పనులపై వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో రోడ్డుపై ఉన్న బూడిద కారణంగా వాహనం పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో నారాయణ ఎడమకాలు కింది భాగంలో విరిగింది. తలకు తీవ్ర గాయమై రక్తస్రావం అయింది. సమాచారం అందుకున్న 108 సిబ్బంది బాధితుడిని విజయవాడ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. ఇబ్రహీంపట్నం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.